క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రసంగం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న స్వప్న హైందవి

విజయనగరం టౌన్: సంతపేట జగన్నాథ స్వామి గుండిచా మందిరం ఆవరణలో ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి ఆదివారం సాయంత్రం చేసిన ఆధ్యాత్మిక ప్రసంగం ఆహూతులను అలరించింది. రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా స్వామివారిని కీర్తిస్తూ పలు కీర్తనలు ఆలపించారు. అనంతరం ఆలయ అధికారులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

విజయనగరం అర్బన్: జిల్లాలోని భీమసింగి సుగర్ ఫ్యాక్టరీ పునఃప్రారంభంపై లోకేశ్ పాదయాత్రలో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఏపీ రైతుసంఘ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఫ్యాక్టరీని ఆధునీకరణ చేయడం సాధ్యం కాదని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చెప్పడం సరికాదని అభిప్రాయపడింది. ఈ మేరకు సంఘ జిల్లా కార్యదర్శి బి. రాంబాబు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. లోకేశ్ పాదయాత్ర చేసే సమయంలో సుగర్‌ఫ్యాక్టరీలను ఆదుకుంటామని హామీ ఇచ్చారని, ఈ విషయం మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మరిచిపోయి ప్రకటనలు చేయడంపై మండిపడ్డారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని పునఃప్రారంభించాలని కోరారు.

ముగిసిన ఫ్యాకల్టీ డవలప్‌మెంట్ శిక్షణ



అతిథులకు మెమెంటో అందిస్తున్న కళాశాల వివిధ విభాగాల ప్రతినిధులు

డెంకాడ: చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో వారం రోజులుగా జరుగుతున్న ఆధ్యాపక అభివృద్ధి శిక్షణ కార్యక్రమం ఆదివారంతో ముగిసింది. ఎంవీజీఆర్ డేటా ఇంజినీరింగ్ విభాగం డీఎస్‌టీ సెర్బ్ సహకారంతోమ జరిగిన శిక్షణ కార్యక్రమానికి ఎంవీజీఆర్ ఐక్యూఏసీ కన్వీనర్ వి.నగేష్, ఎస్‌టీటీపీ కన్వీనర్ పి.శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.రమేష్, డైరెక్టర్ పి.సీతారామరాజు, ఎఫ్‌డీపీ ఆర్గనైజింగ్ చైర్మన్ పి.సతీష్ పాల్గొని ప్రసంగించారు. శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు అందించారు.

ప్రారంభమైన షిర్డీసాయి పవిత్రోత్సవాలు



నక్కానపేటలోని సాయి స్థూపం

పూసపాటిరేగ: మండలంలోని నక్కానపేటలో షిర్డీ సాయి పవిత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 నుంచి 21వ తేదీ వరకు ప్రతిరోజూ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ఉదయం సుప్రభాతం, అభిషేకాలు, అఖండసాయి సంకీర్తన, సాయిసేవక్‌లచే సత్సంగ ప్రసంగం, పవిత్రోత్సవ పూజ, పవళింపు సేవలు జరుగుతాయని సాయి గురువు బొడ్డు విజయరామయ్య తెలిపారు. ప్రతిఏటా విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో సాయి భక్తులు వచ్చి పూజలు చేస్తారు. రాష్ట్రంలోనే ఎత్తైన సాయి స్థూపం నక్కానపేటలో ఉండడంతో సాయి భక్తులు వచ్చి స్థూపంలో సాయికోటి పుస్తకాలు వేసి మొక్కులు చెల్లించుకుంటారు. ఈ నెల 21న షిర్డీసాయి 141 అడుగుల స్థూపంలో ఐదుకోట్ల సాయినామాలు భక్తుల చేతులమీదుగా నిక్షిప్తం చేయనున్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

విజయనగరం ఫోర్ట్: తాటిపూడి జలాశయం వద్ద గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. ఆదివారం రాత్రి మృతదేహం ఒడ్డుకు కొట్టుకు రావడంతో స్థానికులు వీఆర్‌ఓకు సమాచారం ఇచ్చారు. దీంతో వీఆర్‌ఓ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మృతదేహాన్ని విజయనగరం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుడి వయసు సుమారు 55 ఏళ్ల వయసు ఉంటుందని అంచనా. గట్టుపై చెప్పులు, టవల్, వాటర్ ప్యాకెట్లు, దువ్వెన ఉన్నాయని ఎస్సై సురేంద్రనాయుడు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విద్యుత్.. కారాదు విపత్తు

- పెరుగుతున్న విద్యుత్ ప్రమాదాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధికారులు

విజయనగరం: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇళ్లు, కార్యాలయాలు, వ్యవసాయ బావుల వద్ద ప్రమాదాలు పొంచి ఉంటాయి. ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా.. ప్రాణ, ఆస్తి నష్టాలు చోటుచేసుకుంటాయి. రెండు రోజుల కిందట విజయనగరం జిల్లా కేంద్రానికి చెందిన యువకుడు ఇదే తరహాలో ప్రమాదవశాత్తూ మరణించడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అలాగే కొద్ది రోజుల కిందట జిల్లాలో జరిగిన ఓ ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం వల్లే మరణాలు సంభవిస్తున్నాయని ప్రజలు ఆందోళనలు కూడా చేశారు. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్‌లలో సుమారు 70 వేలకు పైగా నివాస భవనాలున్నాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఓ వైపు ప్రమాదాలకు ఆస్కారం లేకుండా విద్యుత్‌శాఖాధికారులు నిర్వహణ పనులు చేపడుతున్నప్పటికీ, వినియోగదారులు అవగాహన లోపంతో ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు.



నగరంలోని విద్యుత్ సబ్‌స్టేషన్

వైరింగ్ ప్రధానం

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే నివాసాలు, పరిశ్రమల్లో వైరింగ్ ముఖ్యం. విద్యుత్ వస్తువుల సామర్థ్యాన్ని అంచనా వేసుకోవడంతో పాటు భవిష్యత్ అవసరాలు తీర్చేలా పటిష్టమైన, నాణ్యమైన రాగి తీగలు కలిగిన వైర్లను వినియోగించాలి. వైరింగ్ రంధ్రాల్లో ఎలుకలు, వర్షం నీరు చేరకుండా చూసుకోవాలి. శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లతో వైరింగ్ చేయించుకోవాలి.

నాణ్యమైన పరికరాలే కొనుగోలు చేయాలి

విద్యుత్ పరికరాలు, వైరింగ్‌కు ఉపయోగించే వైర్లు, వ్యవసాయ మోటార్లు, స్టార్టర్లు వంటి వస్తువులు భారత్ ఇండియా స్టాండర్డ్ (బీఐఎస్) గుర్తింపు కలిగినవే కొనుగోలు చేయాలి. ధర తక్కువకు వస్తున్నాయని నాసిరకం వస్తువులు కొంటే ప్రమాదాలను కొని తెచ్చుకోవడమే అవుతుంది. ధర ఎక్కువైనా నాణ్యమైన వస్తువులు కొనుగోలు చేయడం మంచిదని విద్యుత్ శాఖాధికారులు చెబుతున్నారు.

ఎర్తింగ్ తప్పనిసరి..

విద్యుత్ ప్రమాదాలకు ఎర్త్ చేయబడని పరికరాలే ప్రధాన కారణం. వ్యవసాయ పంపుసెట్లు, స్టార్టర్లు, నివాసాలకు వైరింగ్ చేసేటప్పుడు తప్పనిసరిగా ఎర్తింగ్ చేయించాలి. ఎర్త్ చేయబడని మోటార్లు, స్టార్టర్లు, జీఐ పైపులను రక్షణ లేకుండా తాకవద్దు.

జాగ్రత్తలు పాటించాలి..

విద్యుత్ వినియోగంతో పాటు ఏర్పాటులో జాగ్రత్తలు పాటించాలి. లేనిపక్షంలో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది. ప్రధాన లైన్‌లకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్వహణ పనులు చేపట్టి ప్రమాదాలకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. ముఖ్యంగా విద్యుత్ పనులపై అవగాహన ఉన్న వారిచే ఆ పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయించుకోవాలి. తెలిసీ తెలియని వారితో పనులు చేయించడం ప్రమాదకరం. వినియోగదారులు అప్రమత్తతోనే ప్రమాదాల నివారణ సాధ్యపడుతుంది.

– కిరణ్‌కుమార్, ఏడీఈ, విజయనగరం.

వర్షం కురిసిన సమయంలో జాగ్రత్తపడాలి. తడి ప్రదేశంలో ఇనుప కడ్డీని పాతి దానిని తీగ ద్వారా నివాసాల్లో మెయిన్‌కు, వ్యవసాయ మోటార్లకు అనుసంధానించాలి. ఇందుకోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకోవాలి. తద్వారా విద్యుదాఘాతాన్ని, అధిక విద్యుత్ సరఫరాతో పరికరాలు దగ్ధం కాకుండా నివారించవచ్చు.

సర్వీసు వైరు

స్తంభం నుంచి విద్యుత్ సరఫరా చేసే సర్వీస్ వైరు నాణ్యంగా ఉండాలి. దీనికి ఇన్సులేషన్ ఉన్న జీఐ వైరును సపోర్టుగా వాడటం ద్వారా ప్రమాదాలకు ఆస్కారముండదు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

- కరెంటు పనులను అనుభవం ఉన్న వారితో చేయించుకోవాలి. ఐఎస్‌ఐ మార్కు కలిగిన వైర్లు, స్విచ్‌లు, ఇతర పరికరాలను వాడాలి.
- విద్యుత్ నియంత్రికల వద్ద అనధికారికంగా ఫ్యూజులు వేయడం, మరమ్మతులకు పూనుకోవడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం ప్రమాదకరం. సమస్యలుంటే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలి.
- విద్యుత్ పరికరాలన్నింటికీ ఎర్తింగ్ తప్పనిసరి. కరెంటు ఉపకరణాలు ఉపయోగించే సమయంలో రబ్బర్ చెప్పులు, షూ తప్పనిసరిగా వినియోగించాలి.
- ఆరుబయట వాడే వైర్లు, స్విచ్ బోర్డులు వాటర్ ప్రూఫ్ కలిగి ఉండాలి.
- విద్యుదాఘాతం సంభవిస్తే వెంటనే సరఫరా ఆపివేసి ప్లాస్టిక్ వస్తువు, ఎండు కర్రతో ప్రమాదం జరిగిన వ్యక్తిని వేరు చేయాలి. ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయకుండా నేరుగా తాకరాదు. ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేయాలి.
- వర్షం కురుస్తున్న సమయంలో స్తంభాలను తాకరాదు. తీగలు తెగిపడితే విద్యుత్తు సిబ్బంది సమాచారం ఇవ్వాలి. వారు విద్యుత్తు సరఫరా నిలిపివేసే వరకు ఆ వైపుగా ఎవరిని రాకుండా చూడాలి.
- కూలర్లో నీటిని నింపే సమయంలో తప్పనిసరిగా కరెంటు సరఫరా నిలిపివేయాలి.
- సాకెట్ నుంచి మొబైల్ ఛార్జర్, ఇతర పరికరాలను వేరు చేసే సమయంలో విద్యుత సరఫరాను ఆపాలి.
- కరెంటు తీగలు తెగి వాహనాలపై పడితే.. వాహనం నుంచి కిందికి దిగొద్దు. అలా చేస్తే విద్యుదాఘాతం జరిగే అవకాశముంది. స్థానిక విద్యుత్ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇచ్చి.. సరఫరా నిలిపివేశారని నిర్ధారణకు వచ్చాక వాహనం నుంచి కిందకు దిగాలి.
- విద్యుత్ పరికరాలు, తీగలపై దుస్తులు ఆరబెట్టరాదు. విలువైన పరికరాలకు ఎస్పీడీ, సర్జ్ ప్రొటెక్టివ్ డివైస్‌ను ఉపయోగించాలి.
- ఎత్తైన భవనాలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్, సినిమా థియేటర్లు, విద్యాసంస్థలపై పిడుగు రక్షణ (లైట్నింగ్ ప్రొటెక్షన్) బిగించుకోవాలి.
- పిల్లల ఆస్పత్రులు, విద్యాసంస్థల్లో షట్టర్ టైప్ సాకెట్ ఔట్‌లెట్లను ఉపయోగించాలి.
- స్విమ్మింగ్ పూల్‌లో విద్యుత్ పరికరాలు వాడకూడదు.
- ఆస్పత్రులు, థియేటర్లలో ఎమెర్జెన్సీ లైటింగ్ కోసం ప్రత్యేకంగా వైరింగ్ చేసుకోవాలి.
- తెగిపడిన, వేలాడుతున్న, వదులుగా తక్కువ ఎత్తులో ఉన్న తీగలు /వైర్లను తాకరాదు. వర్షాలు కురిసినప్పుడు తడిచిన ఇనుప స్తంభాలు, విద్యుత్ ఉపకరణాలను తాకకూడదు.
- టూఫేజ్ విద్యుత్‌ను త్రీఫేజ్‌గా మార్చే కన్వర్టర్లను వాడకూడదు. విద్యుత్ మోటార్లు, పంపుసెట్లు, నియంత్రికల్లో సాంకేతిక లోపం తలెత్తితే మోటారు మెకానిక్లతో మరమ్మతులు చేయించుకోవాలి.
- దుస్తులు ఆరేసేందుకు వినియోగించే దండెం తీగలను విద్యుత్ వైర్లకు కలపరాదు.
- వంట గదిలో మిక్సీ, గ్రైండర్ వంటి పరికరాల తీగలకు తాకేలా కూరగాయలు తరిగే చాకులు, షార్ప్‌గా ఉండే పరికరాలను ఉంచొద్దు.
- నాణ్యమైన సెల్‌ఫోన్ చార్జర్లనే ఉపయోగించాలి. స్నానం చేశాక తడి శరీరంతో ఉన్నప్పుడు సెల్‌ఫోన్‌ను చార్జర్ నుంచి తీయరాదు.

శేషపాన్పుపై జగన్నాథుడు



పూజలందుకుంటున్న జగన్నాథస్వామి

విజయనగరం టౌన్ : రథయాత్ర మహోత్సవంలో భాగంగా కోళ్లబజారులో కొలువైన జగన్నాథస్వామి శేషపాన్పుపై ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకుడు నగేషాచార్యులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా కాళ్లనాయుడు రామమందిరంలో ఆలయ అర్చకుడు ఆరవెల్లి సూర్యనారాయణాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పసికందుపై లైంగికదాడి అమానుషం

విజయనగరం ఫూల్‌బాగ్: రామభద్రపురం మండలం జీలుగువలసలో పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడ్ని కఠినంగా శిక్షించాలని డిస్ట్రిక్ట్ చైల్డ్‌రైట్స్ ఫోరమ్ కన్వీనర్ పి.చిట్టిబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో విజయనగరం జిల్లాలో బాలలపై లైంగిక దాడులు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

పరామర్శ

పసికందుపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడ్ని శిక్షించాలని ఐద్వా జిల్లా నాయకురాలు పి. రమణమ్మ డిమాండ్ చేశారు. విజయనగరం ఘోషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారిని, ఆమె తల్లిని కలిసి పరామర్శించారు. హోమ్ మినిస్టర్ అనిత స్పందించి మానవమృగంపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరామర్శించిన వారిలో వంజరాపు లక్ష్మి, ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు వేగోటి లక్ష్మి, ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి డి.కరుణ, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామదేవతల వారాల పండగ

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న గ్రామ దేవతల వారా ల పండగ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. 20 ఏళ్ల తర్వాత పండగ నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. తొలిరోజు గ్రామస్తులు మేళతాళాలు,డప్పు వాయిద్యాలతో దేశమ్మతల్లి గుడికి వెళ్లి పసుపు, కుంకుమ, చీరలు, కోళ్లు సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. మంగళవారం దేశాల మ్మ, కొత్తమ్మ, బంగారమ్మ, ముత్యాలమ్మ, పొదాలమ్మ అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోనున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు.

భీమసింగిలో మరిడమ్మ తల్లి పండగ

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో మరిడమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు ఊరేగింపుగా అమ్మవారి గుడికి వెళ్లి పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పంటలు బాగా పండేలా, పిల్లాపాపలను చల్లగా చూడుతల్లి అంటూ వేడుకున్నారు. పండగ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



జామి: బల్లంకిలో మరిడమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు

బల్లంకిలో పశలమ్మ పండుగ

వేపాడ: బల్లంకి గ్రామంలో పశలమ్మ తల్లి పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పశువులు ఆరోగ్యంగా ఉండాలని, పంటలు సమృద్ధిగా గా పండాలని ఏటా ఖరీఫ్ వరినారు పోసిన తర్వాత ఈపండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామపెద్దలు తెలిపారు. ఏటా మాదిరిగానే గ్రామస్తు లు ఊరేగింపు పశలమ్మ శతకం పట్టు వద్దకు తమ పశువులను తీసుకుని వెళ్లారు. ముందుగా అమ్మవారికి పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకు

దాతలకు నోటీసులు జారీ చేయడం బాధాకరం



మాట్లాడుతున్న చిక్కాల సాంబశివరావు, అరుణకుమారి

నెల్లిమర్ల: శ్మశానం అభివృద్ధికి సహకరించిన దాతలకు రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేయడం బాధాకరమని వైఎస్సార్‌సీపీ నగర పంచాయతీ అధ్యక్షుడు చిక్కాల సాంబశివరావు, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణ, పూసపాటిరేగ ఏఎంసీ మాజీ చైర్‌పర్సన్ చిక్కాల అరుణకుమారి అన్నారు. నెల్లిమర్లలో ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ, నెల్లిమర్ల నగర పంచాయతీ పరిధిలోని థామస్‌పేటలో ఏర్పాటు చేసిన శ్మశానం స్థలం ప్రభుత్వానిదేనన్నారు. శ్మశానం లేక థామస్‌పేట ప్రజలు ఇబ్బంది పడుతుండడంతో సర్వే నంబర్ 27లో స్థలం కేటాయించి అభివృద్ధి చేశామన్నారు. ఈ విషయాన్ని నగర పంచాయతీ కౌన్సిల్, రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. ఇదిలా ఉంటే శ్మశానం అభివృద్ధికి సహకరించిన దాతలకు నేడు నోటీసులు పంపించడం సరికాదన్నారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చిక్కాల సంతోష్‌కుమార్, చిక్కాల సుమతి, నాయకులు బూర సత్తిబాబు, మజ్జి గణేష్, మహంతి అప్పలనాయుడు, ఇడదీసి శ్రీనివాసరావు, కారుకొండ హరీష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కారానికి సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత, సామాజిక సమస్యలను తెలియజేస్తే ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

ఆవిష్కరణ

విజయనగరం: నగరంలోని వీటీ అగ్రహారం ఆర్యవైశ్య సంఘం ప్రచురించిన నోట్‌బుక్స్‌ను మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆదివారం ఆవిష్కరించారు. కోలగట్ల స్వగృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, పేద విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేయాలనే సంకల్పం చాలా గొప్పదని, అటువంటి సేవలు అందిస్తున్న సంఘ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు మండవిల్లి వెంకటరాజు, వాసవి ఫౌండేషన్ సెక్రటరీ బబ్బిలిశెట్టి వెంకట సత్యనారాయణ, వాసవీ క్లబ్ అధ్యక్షుడు చెన్నుబుచ్చి జనార్దనరావు, వోబిలిశెట్టి వెంకట రమణమూర్తి, కట్టమూరి ఆంజనేయులు, కుసుమంచి రమేష్, పులిపాటి వెంకటరామారావు, నాగోల్ సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



నోట్‌బుక్స్ ఆవిష్కరిస్తున్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

జగన్‌పై అక్రమ కేసులు అన్యాయం

- మాజీ ఎమ్మెల్యే కడుబండి ధ్వజం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు, నాయకులు

శంగవరపుకోట: ఉండి నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ మోహన్‌రెడ్డిపై అక్రమ కేసులు బనాయించడం అన్యాయమని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులతో కలిసి ఆది వారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటువంటి కేసులు పరిగణనలోకి తీసుకోరాదని మూడేళ్ల క్రితమే సుప్రీంకోర్టు తీర్పు చెప్పిందని ... ఇప్పుడు అందుకు విరుద్ధంగా కేసులు బనాయించడం ఏతర హా రాజకీయమో ప్రభుత్వ పెద్దలు ఆలోచించుకోవాలన్నారు. నాడు సుప్రీం కొట్టేసిన కేసులో నేడు జగన్‌పైనా, ఐపీఎస్ అధికా రులు, డాక్టర్లపై కేసులు నమోదు చేయడం ఎవరి సంతోషం కోసమని ప్రశ్నించారు. మూడేళ్ల తర్వాత కేసులు పెడుతూ రాష్ట్ర పోలీసులు కొత్త సంప్రదాయానికి తెర తీశారన్నారు. ఈకేసులో జగన్ ఎలా ముద్దాయి అవుతారని ప్రశ్నించారు. గత నెల 11న ఈ–మెయిల్ ద్వారా గుంటూరు ఎస్పీకి ఫిర్యాదు చేస్తే అంతకు ఒక రోజు ముందే జూన్ 10న పోలీసు లు లీగల్ ఓపీనియన్‌కు వెళ్లడం విశేషమన్నారు. అంటే రఘురామ కృష్ణంరాజు ఫిర్యాదు చేస్తారని ముందే పోలీసులకు తెలుసా అని ప్రశ్నించారు. బడికి వెళ్లే ప్రతీ బిడ్డకు తల్లికి వందనం అంటూ రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల్లో కూటమి నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత తల్లులను దగా చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైందన్నారు. ప్రతీ బిడ్డకి కాకుండా తల్లికి రూ.15వేలు ఇస్తామని మాట మారుస్తూ ప్రభుత్వం జీఓ తీసుకువచ్చి దగా చేయడం తగదన్నారు.ప్రతి పథకాన్ని నాడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆధార్‌తో లింక్ చేస్తే ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఆధార్‌లింక్ కోసమే జీఓ ఇచ్చామనడం విడ్డూరంగా ఉందన్నారు. నాటి అమ్మ ఒడి పథకానికే తల్లికి వందనం అని పేరు మార్చి దగా చేయాలనుకోవడం తల్లికి పంగనామం పెట్ట డమేనని అన్నారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ సమాధానం చెప్పాలన్నారు. గత నాలుగేళ్లు క్రమం తప్పకుండా అర్హులైన ప్రతి ఒక్కరికి అమ్మఒడి అందించామని అందుకు గణాంకాలే సాక్ష్యం అన్నారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు సూపర్ సిక్స్ హామీలంటూ గొప్పగా ఊరూరా చాటారని, ఇప్పుడు వాటి ఊసెత్తడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసి, ప్రజలకు న్యాయం చేయాలని కోరారు.

చక్కెర కర్మాగారం తెరిపించేందుకు చొరవ చూపాలి

జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పెద్దమనసు చేసుకుని భీమసింగి చక్కెర కర్మాగారం తెరిపించే దిశగా చర్యలు తీసుకుని రైతాంగానికి సహాయపడాలని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాస రావు కోరారు. భీమసింగి కర్మాగారం ఆర్థిక ఇబ్బందుల వల్ల మూతపడడం తెలిసిందేనని, నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ చొరవ తీసుకుని కర్మాగారాన్ని తెరిపించారని గుర్తు చేశారు. అయితే గత కొన్నేళ్లుగా కర్మాగారం మూతపడిందని, మంత్రి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో ఈ కర్మాగారం ఉన్నప్పటికీ, ఎక్కువ మంది చెరుకు రైతులు ఎస్.కోట నియోజకవర్గం వారున్నారని చెప్పారు. మంత్రి శ్రీనివాస్ ప్రభుత్వంతో చర్చించి, కర్మాగారాన్ని తెరిపించే ప్రయత్నం చేయాలని కోరారు. జెడ్పీటీసీ మమ్ములూరి వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకటరమణ, సర్పంచ్ వెంకటరావు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చురుగ్గా పూడికతీత పనులు



బొండపల్లి వద్ద పూడిక, తుప్పలు తొలగించిన అనంతరం బి.వి.ఛానల్

బొండపల్లి: బొండపల్లి–వెంకటాపురం సాగునీటి కాలువలో పూడికతీతతో పాటు, తుప్పలు, డొంకల తొలగింపు పనులు నాలుగు రోజులుగా ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో రైతులు మమ్మురంగా చేపడుతున్నారు. గజపతినగరం మండలంలోని పట్రువాడ గ్రామం వద్ద చంపావతి నదిలో అడ్డుకట్టవేసి ఈకాలువ ద్వారా నీటి మళ్లించి చెరువులను నింపి పొలాలకు సాగునీటిని అందిస్తుంటారు. గజపతినగరం మండలంలోని వెంకటాపురం, బూడిపేట, దావాలపేట గ్రామాలతో పాటు,బొండపల్లి మండలంలోని బోడసింగిపేట, బొండపల్లి, తమటాడ, గొల్లలపేట, ముద్దురూ తదితర గ్రామాలకు ఈ కాలువ ద్వారా సాగునీరు అందుతోంది. ఏటా ఖరీఫ్ వరినాట్లు వేసే ముందు ఈ కాలువలో పూడికతీత పనులు చేపడుతుంటారు. ఈ ఏడాది వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో చంపావతి నదిలో నీటి ప్రవాహం లేదు. మెంటాడ మండలంలోని గుర్ల గెడ్డతో పాటు,ఆంధ్ర రిజర్వాయర్ లీకుల ద్వారా వచ్చే నీరే చంపావతిలో ప్రవహిస్తోంది.